7

సాక్షి విశాఖపట్నం

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025

రాష్ట్రంలో పగ, దగా పథకాలే..

- కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది
- గ్రూప్-2 అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారు
- ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం
- జగన్ కోసం ప్రాణాలు ఇచ్చే వారు కోట్లాది మంది ఉన్నారు
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు. చిత్రంలో అరకు ఎంపీ తనూజరాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, చిన్న శ్రీను, ధర్మాన కృష్ణదాస్, పార్టీ నేతలు (ఇన్‌సెట్) కన్నబాబును అభినందిస్తున్న బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో చంద్రన్న పగ.. చంద్రన్న దగా సంక్షేమ పథకాలే అమలవుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒకటి కూడా పూర్తి స్థాయిలో అమలుచేసిన పాపానపోలేదని, ఈ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం లేదని పేర్కొన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమన్వయ కర్తగా బృహత్తరమైన బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్ర అంటే ఉద్యమాలకు పురిటి గడ్డలాంటిదని, ఈ ప్రాంత ప్రజలు ఉద్యమిస్తే.. సాధించేవరకూ పట్టు వదలరని కొనియాడారు. అలాంటి ఈ ప్రాంత అభివృద్ధి కోసం విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసేందుకు అన్నివిధాలా తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేశారన్నారు. ప్రజలకు ఏమైతే మాట ఇస్తారో.. అది చేయడం వైఎస్ జగన్ నైజమన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వారిచ్చిన ప్రతి హామీని అమలుచేసేలా వైఎస్సార్ సీపీ ప్రజల తరపున పోరాడుతుందని పేర్కొన్నారు. కూటమి 8 నెలల పాలనలో రూ.లక్షా 20 వేల కోట్లు అప్పు చేసిన సీఎం చంద్రబాబు.. ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని సేనల కన్నా వైఎస్ జగన్ సేన స్ట్రాంగ్‌గా ఉందని, ఆయన కోసం ప్రాణాలు ఇచ్చే కోట్లాది మంది కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు న్నారన్నారు. వైఎస్ జగన్ అంటే ఒక శక్తి.. ఆయన చాలా స్ట్రాంగ్ అని స్పష్టం చేశారు. ప్రజలే తమ బలమన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఒకరిద్దరు వెళ్లినంత మాత్రానా ఎటువంటి నష్టం లేదన్నారు.

కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనూజ రాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాస రావు, ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజ్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, పీవీ సురేష్, సాడి పద్మారెడ్డి, ఇమ్రాన్, ముఖ్యనేతలు కోలా గురువులు, రొంగలి జగన్నాథం, చొక్కాకుల వెంకట్రావ్, మొల్లి అప్పారావు, రవిరెడ్డి, పేర్ల విజయచందర్, కాయల వెంకటరెడ్డి, పేడాడ రమణికుమారి, మారుతీప్రసాద్, బోని శివరామకృష్ణ, శ్రీదేవి వర్మ, మాధవి వర్మ, పీలా వెంకటలక్ష్మి, కాళిదాస్‌రెడ్డి, సనపల రవీంద్ర భరత్, అల్లంపల్లి రాజుబాబు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థుల యువగర్జన చూశాం

ఎన్నికలకు ముందు లోకేష్ యువగళమంటూ తిరిగాడు.. అసలుసిసలైన యువ గర్జన విశాఖ కేంద్రంగా గ్రూప్-2 అభ్యర్థులు చేశారని కన్నబాబు అన్నారు. గ్రూప్-2 పరీక్ష వాయిదా వేస్తామంటూ నమ్మించి అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారన్నారు. నిరుద్యోగులనే కాదు.. మహిళలు, అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం దగా చేసిందని మండిపడ్డారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ



విశాఖ-లీగల్ : విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని విశాఖ న్యాయవాదుల సంఘం ఆవరణలో ఆరు జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యాయవాదులందరూ విశాఖకు హైకోర్టు బెంచ్, కేంద్ర పారిశ్రామిక ట్రిబ్యునల్ ఏర్పాటుకు ముందడుగు వేయాలని నిర్ణయించారు. శ్రీకాకుళం, పార్వతీపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లాలంటే చాలా భారమవుతుందని న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ అన్ని రకాలుగా మోసానికి గురైందని వెల్లడించారు. అంతర్జాతీయ ఖ్యాతిని గడిస్తున్న విశాఖకు హైకోర్టు బెంచ్ కేటాయించడం అన్ని విధాల శ్రేయోదాయకమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నరసింహారావు మాట్లాడుతూ విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు న్యాయశాఖకు అభ్యంతరాలు ఉండకపోవచ్చన్నారు. 1993లో హైకోర్టు సాధనకు న్యాయవాదులు చేసిన ఉద్యమాలను గుర్తు చేస్తూ భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యంతో పోరాడతామన్నారు. సోమవారం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయస్థానానికి హాజరవుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మీరాంబాబు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఏపీ పార్వతీశం, కృష్ణ శేఖర్, పూర్వ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, పాలకొండ, బొబ్బిలి, రాజాం, గజపతినగరం, అనకాపల్లి, చోడవరం, తుని, యలమంచిలి, విజయనగరం, ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొన్నారు. న్యాయవాద సంఘం కార్యదర్శి డి.నరేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.



ఏయూలో పరీక్ష కేంద్రం వద్ద భారీ క్యూ

కఠిన పరీక్ష

గ్రూప్-2 అభ్యర్థులతో ఆటలాడుకున్న కూటమి ప్రభుత్వం

పరీక్ష వాయిదా వేస్తామంటూ ఆఖర్లో చేతులెత్తేసిన వైనం

చంద్రబాబు సర్కారుకి బలైన నిరుద్యోగ అభ్యర్థులు

మొదటి పేపర్‌కు 85.14 శాతం, రెండో పేపర్‌కు 84.95 శాతం హాజరు



డ్రోన్ కెమెరాలతో నిఘా



పరీక్ష హాల్ మరో చోట అని చెప్పడంతో పరుగులు తీస్తున్న అభ్యర్థులు



నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

సాక్షి, విశాఖపట్నం : ఏపీపీఎస్సీ చరిత్రలో ఎన్నడూ లేని గందరగోళం. చంద్రబాబు సర్కారు బాధ్యతారాహిత్యంతో చివరి వరకు అభ్యర్థుల్లో ఆందోళన. చివరికి పరీక్ష కేంద్రంలోనూ తీవ్ర ఒత్తిడికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. రోస్టర్ విధానంపై గత కొంతకాలంగా గ్రూప్-2 అభ్యర్థులు పోరాటాలు చేస్తున్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గ్రూప్-2 అభ్యర్థులకు న్యాయం చేస్తానంటూ ట్వీట్ చేశారు. సీఎం చంద్రబాబు పరీక్ష వాయిదా వెయ్యాలంటూ ఏపీపీఎస్సీకి లేఖ రాశారు. దీంతో పరీక్ష ఆగిపోతుందని అభ్యర్థులు భావించారు. పరీక్ష వాయిదా వెయ్యలేమంటూ ఏపీపీఎస్సీ చెప్పడంతో అభ్యర్థులు ఒత్తిడికి గురయ్యారు. పరీక్షకు 8 గంటల ముందు వరకూ చంద్రబాబు ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్పి నిరుద్యోగులతో ఆటలాడుకుంది. చివరికి పరీక్షకు వెళ్లాలంటూ చెప్పేసింది.

పరీక్ష రాసినా ఏం ఉపయోగం.?

గ్రూప్-2 అభ్యర్థులు ప్రిపరేషన్‌ని పక్కనపెట్టి ప్రభుత్వంతో పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో చాలా మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనా ఫలితం లేదని భావించారు. మరికొందరు చిన్నపాటి ఆశతో పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 16 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 11,030 మందికి గాను ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు జరిగిన తొలి పేపర్‌కు 9,391 (85.14 శాతం) మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగిన రెండో పేపర్‌కు 9,370 (84.95 శాతం) మంది హాజరయ్యారు.

ఒత్తిడితోనే పరీక్ష రాసిన అభ్యర్థులు

ప్రభుత్వం చేసిన నిర్వాకంతో అభ్యర్థులంతా తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. దాదాపు ప్రతి ఒక్కరూ ఒత్తిడిలోనే పరీక్షలు రాశారు. కొందరు అభ్యర్థులు అస్వస్థతకు గురయ్యారు. కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం పరీక్ష రాస్తున్న ఓ అభ్యర్థి తీవ్ర ఒత్తిడికి లోనై అస్వస్థతకు గురయ్యారు. అధికారులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

భద్రత కట్టుదిట్టం

పరీక్ష సమయంలో ఎలాంటి ఆందోళనలు జరగకుండా చర్యలు తీసుకోవాలంటూ కూటమి ప్రభుత్వం అధికారుల్ని ఆదేశించడంతో ప్రతి కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. అణువణువు గాలింపు చర్యలు చేపట్టారు. మునుపెన్నడు లేని విధంగా డ్రోన్లతో పరీక్ష కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరం వరకూ తనిఖీలు చేపట్టారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమే కాకుండా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అన్ని పరీక్షా కేంద్రాలను కెమెరాలతో అనుసంధానం చేస్తూ డ్యాష్ బోర్డుతో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

అధికారుల పర్యవేక్షణ

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి పలు కేంద్రాలకు వెళ్లి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఏయూలోని న్యూ క్లాస్ రూమ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని, జైల్ రోడ్డులోని డిగ్రీ మహిళా కళాశాల, సీతంపేట పరిధిలోని బీవీకే, ప్రిజమ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ద్వారా డీఆర్వో భవానీశంకర్ పరిస్థితిని సమీక్షించారు.

- అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన డి.శ్యామల కొమ్మాదిలోని విజయం స్కూల్ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా రావడంతో బయట నిలిపివేశారు. అలాగే రొంగలినాయుడుపాలేనికి చెందిన కొండబాబు బీవీకే కళాశాల కేంద్రానికి ఆలస్యంగా రావడంతో సిబ్బంది లోపలకు అనుమతించలేదు.

డూప్లికేట్ హాల్ టికెట్‌తో హాజరు

సీతంపేట: డూప్లికేట్ హాల్ టికెట్‌తో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షా కేంద్రంలోకి ఓ యువతి ప్రవేశించింది. సీతంపేట ప్రిజం డిగ్రీ కళాశాల సెంటర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. నెల్లూరుకు చెందిన నందిని అనే విద్యార్థిని ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అవ్వని విషయాన్ని దాచిపెట్టి మెయిన్స్ పరీక్ష కోసమని తల్లిదండ్రులతో కలిసి విశాఖ వచ్చింది. పరీక్ష కేంద్రంలో సిబ్బంది ఆమె డూప్లికేట్ హాల్ టికెట్‌ను చూసి ఈ నంబరు లేదని చెప్పారు. వెంటనే ఆమె బాత్ రూమ్‌కు అంటూ వెళ్లి అక్కడ స్పృహ తప్పి పడిపోయింది. దీంతో పరీక్షా కేంద్రం సిబ్బంది ద్వారకా పోలీసుల సాయంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి తల్లిదండ్రులతో నెల్లూరు పంపించేశారు. దీనిపై ద్వారకా సీఐ రమణను వివరణ కోరగా సంఘటన జరగడం వాస్తవమే అని తెలిపారు.

ఇక కోర్టులోనే తేల్చుకుంటాం..



రోస్టర్‌లో తప్పిదాలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేస్తుందని భావించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్పందించి పరీక్ష వాయిదాపై ఏపీపీఎస్సీకి సూచించడం, మంత్రి లోకేష్ న్యాయ నిపుణులతో మాట్లాడుతున్నాం .. అభ్యర్థులకు న్యాయం చేస్తాం అని ట్విట్టర్ ద్వారా స్పందించంతో సానుకూల నిర్ణయం వస్తుందని ఆశించాం. మేము ఊహించని విధంగా మాకు ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం పరీక్షకు హాజరైనప్పటికీ మాకు న్యాయం జరుగుతుందనే ఆశ లేదు. ఇక కోర్టులోనే న్యాయ పోరాటం చేస్తాం.

– లోకేష్, గ్రూప్-2 అభ్యర్థి

నిరుద్యోగులను మోసం చేయడమే..



నిరుద్యోగులకు మంచి చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవు. పైగా అభ్యర్థులు నష్టపోకుండా గ్రూప్-2 రోస్టర్‌ను సరిచేయాలని, అంతవరకు పరీక్ష వాయిదా వేయాలని ఉద్యమించినా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. శనివారం రాత్రి వరకు నిరసన చేపట్టిన అభ్యర్థులు చేసేది లేక ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వేర్వేరు జిల్లాల్లోని పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్ష రాశారు. కూటమి ప్రభుత్వం ఇందుకు మూల్యం చెల్లించక తప్పదు. ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు వచ్చే అన్ని ఎన్నికల్లో బుద్ధి చెబుతాం.

– రోహిత్ కుమార్, గ్రూప్-2 అభ్యర్థి

కొనాలంటే బర్డ్ ఫ్లూ ఫ్రీగా ఇస్తే క్యూ

- పలు చోట్ల ఫ్రీగా చికెన్, ఎగ్ వంటకాల పంపిణీ
- బారులు తీరిన జనం
- ఫిష్, మటన్ షాపుల కళకళ
- చికెన్ షాపుల వెలవెల




దొండపర్తిలో ఫ్రీ చికెన్ మేళా వద్ద బారులు తీరిన మాంసాహార ప్రియులు



కోరమాండల్ గేట్ వద్ద చికెన్ ఫ్రై పంపిణీ

సాక్షి, విశాఖపట్నం : చికెన్ తింటే బర్డ్ ఫ్లూ.. గుడ్డు తింటే బర్డ్ ఫ్లూ.. అంటూ భయపడుతున్న జనం.. దుకాణాలకెళ్లి చికెన్, గుడ్లు కొనడం మానేశారు. నిపుణులు ఎన్ని జాగ్రత్తలు చెప్పినా.. వైద్యులు ఇంకెన్ని సూచనలు చేసినా.. అబ్బే మేం తినం గాక తినం అంటూ నోరుకట్టుకుని కూర్చున్నారు. దీంతో కొద్ది రోజులుగా నగరంలోని చికెన్ దుకాణాలన్నీ వెలవెలబోతుండగా... మటన్, చేపల దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఫిషింగ్ హార్బర్‌లో చేపలకు డిమాండ్ ఏర్పడింది. ఆదివారం కావడంతో నగరవాసులంతా చేపల కొనుగోళ్లకు క్యూ కట్టారు. జిల్లాలో చికెన్ కొనుగోళ్లు దాదాపు 70 శాతం వరకూ పడిపోయాయి. కానీ దొండపర్తిలో మాత్రం ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా సీన్ రివర్స్ అయింది. చికెన్ కొనండి అంటే అమ్మో.. బర్డ్‌ఫ్లూ వచ్చేస్తుందని పారిపోయిన ప్రజలు.. ఇక్కడ ఫ్రీగా చికెన్, గుడ్లు పంచుతుంటే మాత్రం బర్డ్ ఫ్లూ లేదు ఏమీ లేదు అంటూ.. బారులుదీరారు. పలువురు వ్యాపారులు, పౌల్ట్రీ యజమానులు కలిసి దొండపర్తి ఎరుకమాంబ గుడి సమీపంలో చికెన్ వంటకాలు, ఎగ్ స్నాక్స్‌ను ఉచితంగా పంపిణీ చేయడంతో వందలాది మంది లొట్టలేసుకొని మరీ తిన్నారు. ఈ ఉచిత చికెన్ మేళాలో వందల కేజీల చికెన్, వందలాది గుడ్లతో తయారు చేసిన స్నాక్స్ ఉచితంగా పంచారు. చికెన్‌తో ఎలాంటి రోగాలు రావని.. ప్రతి ఒక్కరు తినొచ్చని ప్రజల్లో అవగాహన కల్పించడం కోసమే ఉచితంగా చికెన్ వంటకాలు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. అలాగే కోరమాండల్ సమీపంలో పౌల్ట్రీ నిర్వాహకులు చికెన్, ఎగ్ ఫ్రై పంపిణీ చేశారు. ఆ దారిన పోయేవారు లొట్టలు వేసుకుంటూ హాయిగా చికెన్,ఎగ్‌లను ఆరగించారు.



వెలవెలబోతున్న చికెన్ దుకాణాలు



కిటకిటలాడుతున్న ఫిషింగ్ హార్బర్

ఆషామాషీ కాదు

ఆమె ఎమ్మెల్యే సోదరి

- అనుమతులు లేకుండా దర్జాగా కమర్షియల్ భవన నిర్మాణం
- నిబంధనలకు పాతరేసి చకచకా పనులు
- ఐదేళ్ల క్రితం ఆగిపోయిన నిర్మాణాన్ని పూర్తి చేస్తున్న మాజీ కౌన్సిలర్
- ఎమ్మెల్యే పల్లా సోదరి కావడంతో చేతులెత్తేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు



పాతగాజువాక జాతీయ రహదారిని ఆనుకొని ఎమ్మెల్యే పల్లా సోదరి నిర్మిస్తున్న భవనం

సాక్షి, విశాఖపట్నం : వడ్డించేవాడు మనోడైతే మర్యాదలకు లోటుండదు. అధికారంలో మనోడుంటే అధికారుల నుంచి గొడవుండదు. నిబంధనలు అతిక్రమించవచ్చు.. అక్రమ కట్టడాలు కట్టేయవచ్చు.. గాజువాకలో ఓ మాజీ కౌన్సిలర్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోదరి చేపట్టిన ఒక వాణిజ్య సముదాయ నిర్మాణం ఇప్పుడు హాట్ టాపిక్ మారింది. నిబంధనలు అతిక్రమించినా, సెట్ బ్యాక్‌లు లేకపోయినా.. నిర్మాణానికి అసలు అనుమతే లేకపోయినా ఐదంతస్తుల భవన నిర్మాణం ఆగమేఘాల మీద పూర్తయిపోతోంది.

ఐదో అంతస్తు నిర్మాణానికి ఏర్పాట్లు

పాతగాజువాకలోని పంతులుగారి మేడ సమీపంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోదరి తన కుమారుల పేరుతో 250 చదరపు గజాల స్థలంలో ఐదేళ్ల క్రితం నిర్మాణం చేపట్టగా.. స్థల వివాదంతో మధ్యలో నిలిచిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఆమె తన అధికారాన్ని ఉపయోగించుకుంటున్నారు. తన సోదరుడు ఎమ్మెల్యే కావడంతో అటు జీవీఎంసీ అధికారులను, ఇటు టౌన్‌ప్లానింగ్ అధికారులను తన భవనం వైపు రాకుండా అడ్డుకుంటున్నారు. అనుమతులు లేకుండానే ఇప్పటివరకు నాలుగు అంతస్తుల నిర్మాణాన్ని పూర్తి చేసి ఐదో అంతస్తు నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు.

నిబంధనల ఉల్లంఘన ఇలా..

ఈ స్థలం జాతీయ రహదారిపై ఉండటంతో నిబంధనల ప్రకారం ఐదు అంతస్తుల నిర్మాణం సాధ్యం కాదని టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెబుతున్నారు. హైవే నుంచి 90 అడుగుల వరకు రోడ్డును చూపించి మిగిలిన స్థలంలో నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన 250 చదరపు గజాల స్థలంలో సెట్‌బ్యాక్‌లను వదిలిపెడితే 130 చదరపు గజాల స్థలంలోనే నిర్మాణం చేపట్టాలి. హైవే పక్కన ఈ కొద్దిపాటి స్థలంలో ఐదంతస్తుల నిర్మాణం సాధ్యం కాని నేపథ్యంలో నిర్మాణదారు అధికారులను ఏమరుపర్చింది. మొత్తం 700 గజాల స్థలం ఉన్నట్టుగా మూడు అంతస్తుల నిర్మాణానికి నామమాత్రపు రుసుం చెల్లించి దరఖాస్తు చేసింది. స్థలాన్ని పరిశీలించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ దరఖాస్తును తిరస్కరించారు. అయినప్పటికీ ఆమె ఆ దరఖాస్తు నంబరును చూపించి 250 చదరపు గజాల స్థలంలో ఇప్పటివరకు నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించింది. తాజాగా ఐదో అంతస్తు నిర్మాణం కోసం డెకింగ్ వేశారు. నాలుగు అంతస్తుల నిర్మాణం వరకు పట్టించుకోని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఐదో అంతస్తు నిర్మాణాన్ని అడ్డుకోవడం కోసం ప్రయత్నించారు. ఐదో అంతస్తు డెకింగ్‌ను ఇప్పటి వరకు మూడుసార్లు కూలదోశారు. అయినప్పటికీ ఆమె వెనక్కి తగ్గలేదు. తన సోదరుడి పలుకుబడిని టౌన్‌ప్లానింగ్ అధికారుల వద్ద వాడుకొని వారిని రాకుండా అడ్డుకుంటోందని చెబుతున్నారు. వాస్తవానికి జాతీయ రహదారి పక్కన ఎటువంటి అనుమతులు లేకుండా ఇంత పెద్ద భవనం నిర్మించడం సాధ్యం కాదు. ఒకవేళ ప్లాన్ అనుమతులు ఉన్నా వారు దరఖాస్తు చేసినదాని ప్రకారం మూడు అంతస్తులను మాత్రమే నిర్మించాల్సి ఉంది. ఇందులో ఒక్క నిబంధనను కూడా వారు పాటించలేదు. ఈ విషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు మీరితే చర్యలు తప్పవు

ఆ భవనం విషయం నాకు తెలియదు. ఏం జరుగుతుందో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ను, వార్డు టౌన్ ప్లానింగ్ సెక్రటరీని కనుక్కుంటాను. నిబంధనలను అతిక్రమిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అనధికార నిర్మాణాన్ని అనుమతించే ప్రసక్తే లేదు.

– వెంకటరావు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, గాజువాక

క్లుప్తంగా

యువకుడ్ని రక్షించిన బీచ్ లైఫ్ గార్డ్స్



దన్వర్ సింగ్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన లైఫ్ గార్డ్స్

పెదగంట్యాడ: యారాడ తీరంలో సరదాగా గడుపుదామని వెళ్లిన యువకుడు సముద్రంలో కొట్టుకుపోతుండగా బీచ్ లైఫ్ గార్డ్స్ రక్షించారు. విజయనగరానికి చెందిన నలుగురు యవకులు ఆదివారం సాయంత్రం యారాడ తీరానికి వచ్చారు. అక్కడ కాసేపు ఇసుక తిన్నెల్లో గడిపిన వారంతా సముద్రంలో దిగారు. ఒక్కసారిగా అలల తాకిడి ఎక్కువ కావడంతో దన్వర్ సింగ్ అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న లైఫ్‌గార్డ్స్ కదిరి లోవరాజు, లోవేష్ కుమార్, శ్రీనివాస్, కె. వెంకటేష్ గమనించి దన్వర్ సింగ్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

వ్యవసాయ, పర్యావరణంపై అధ్యయనాలు



మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్ గలాబ్

కొమ్మాది: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయంగా వివిధ పాలసీలకు సంబంధించిన సమస్యలపై అధ్యయనం చేసేందుకు ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఏపీ (ఐడీఎస్ఏపీ) స్వతంత్ర్య సంస్థగా ఆవిర్భవించిందని డైరెక్టర్ ఎస్.గలాబ్ అన్నారు. మధురవాడ మిధులాపురి వుడా కాలనీలో సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రముఖ ఆర్థికవేత్త రొక్కం రాధాకృష్ణ ఆలోచనలతో రూపకల్పన చేసిన సంస్థను 2018–19లో ప్రారంభించామన్నారు. విశాఖ కేంద్రంగా మధురవాడలో కార్యాలయం ఏర్పాటు చేసి వ్యవసాయ, పర్యావరణ సానుకూల సామర్థ్య పరిశీలన తదితర అంశాలపై నిత్యం అధ్యయనాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు సంస్థ రొక్కం రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో స్మారక ఉపన్యాసం జరుగుతుందని, దీనికి రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జె.రామునాయుడు, విజిటింగ్ ప్రొఫెసర్ సి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.85
స్కిన్	: రూ.140
స్కిన్‌లెస్	: రూ.150

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	460.00
విజయనగరం	464.00
శ్రీకాకుళం	464.00

పరిశోధకుల పరీక్షలకు గ్రీన్ సిగ్నల్

- వీసీ శశిభూషణ్ రిలీవ్ అయిన రోజునే సర్క్యులర్
- హయ్యర్ ఎడ్యుకేషన్ మౌఖిక ఆదేశాలు అంటూ వెల్లడి
- అభియాన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవడంలో అంతా గోప్యత
- టీడీఆర్ హబ్ ప్రవేశాలపై ఎందుకీ హైడ్రామా
- అవినీతి ఆచార్యులతో ఏయూకు అప్రతిష్ట



టీడీఆర్ హబ్

విశాఖవిద్య: ఆంధ్ర యూనివర్సిటీలో పీహెచ్‌డీ స్కాలర్స్ పరీక్షలకు వర్సిటీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టీడీఆర్ హబ్ ద్వారా ప్రవేశాలు పొందిన రీసెర్చ్ స్కాలర్స్ విషయంలో జనవరి 28న ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటున్నట్లు వర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్ తాజాగా మరో ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత విద్యామండలి మౌఖిక ఆదేశాల మేరకు ఇది తక్షణమే అమల్లోకి వస్తోందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆచార్య శశిభూషణరావు వీసీగా బాధ్యతల నుంచి రిలీవ్ అయిన రోజే (ఈ నెల 18న) ఉత్తర్వులు జారీ కాగా, వర్సిటీ విభాగాధిపతులకు అవి చేరకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వర్సిటీకి నూతన వైస్‌చాన్సలర్‌గా నియమితులైన ఆచార్య రాజశేఖర్ నేడో, రేపో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇలాంటి సమయంలో, ఆచార్య శశిభూషణరావు వీసీగా తప్పుకున్న రోజున ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తారా..? లేదా..? అనే అనుమానాలను కొంతమంది ఆచార్యులు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు, ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయాలతో టీడీఆర్ హబ్ ద్వారా చేపట్టిన ప్రవేశాలపై ప్రస్తుత అధికారులు అనుసరిస్తున్న విధానాలు రీసెర్చ్ స్కాలర్స్‌ను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

టీడీఆర్ హబ్‌పై ఎందుకీ హైడ్రామా

ఆంధ్ర యూనివర్సిటీలో 2019 నుంచి 2023 వరకు 680 మంది విద్యార్థులు పీహెచ్‌డీ కోర్సుల్లో చేరారు. వీరితో పాటు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదంతో మరో 72 మంది వరకు ప్రవేశాలు పొందారు. ఇదంతా నిబంధనల మేరకే జరిగినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వర్సిటీలో రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. ఈ ప్రభావం రీసెర్చ్ స్కాలర్స్‌పై చూపుతోంది. టీడీఆర్ హబ్ ప్రవేశాల విషయంలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలే తప్ప, పరీక్షలు నిలిపివేయడమేంటని పరిశోధక విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. ఇది దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందని భావించిన ఉన్నత విద్యామండలి, పరీక్షల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

వారితోనే ఏయూకి అప్రతిష్ట

ఆంధ్ర యూనివర్సిటీకి ఉన్న క్రేజ్‌తో ఇక్కడ పరిశోధనలు చేసేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే, వర్సిటీకి మరింత ఖ్యాతి ఇనుమడింపజేసేలా ప్రసాద్ రెడ్డి వీసీగా ఉన్న సమయంలో ట్రాన్స్ డిసిప్లెనరీ రీసెర్చ్ (టీడీఆర్) హబ్‌ను ఏర్పాటు చేసి, దీని ద్వారానే పరిశోధనలకు సంబంధించిన ప్రవేశాలు చేపట్టారు. డాక్టరేట్ ప్రదానం చేసేందుకు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసే, వర్సిటీలోని ఒకరిద్దరు ఆచార్యులకు ఇది మింగుడుపడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రెక్కలొచ్చిన సదరు అవినీతి ఆచార్యులు, పనిగట్టుకొని ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో రీసెర్చ్ స్కాలర్స్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టాయనే ప్రచారం ఉంది.

ఏపీఆర్‌సెట్ విద్యార్థులకే వెసులుబాటు

రీసెర్చ్ స్కాలర్స్ పరీక్షల విషయంలో గతంలో ఇచ్చిన అభియాన్స్ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న మాట వాస్తవమే. ఏపీఆర్‌సెట్ ద్వారా ప్రవేశాలు పొందిన వారికే పరీక్షలు కొనసాగించేలా ఉన్నత విద్యామండలి నుంచి మౌఖిక ఆదేశాలు ఉన్నాయి. ఇదే విషయాన్ని వర్సిటీ అన్ని విభాగాధిపతులకు సమాచారం ఇచ్చాం. **కె. ఈశ్వర కుమార్, అకడమిక్ ఎఫైర్స్ డీన్**

మాకెలాంటి ఉత్తర్వులు అందలేదు

రీసెర్చ్ స్కాలర్స్ పరీక్షలు నిర్వహించాలని మాకు ఎలాంటి ఉత్తర్వులు ఇంకా అందలేదు. ఏదైనా అంతా నిబంధనలు మేరకే జరుగుతుంది. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగానే టీడీఆర్ హబ్ నిర్ణయాలు ఉంటాయి. కొత్త వైస్ చాన్సలర్ వచ్చాకే రీసెర్చ్ స్కాలర్స్‌కు పరీక్షలు నిర్వహించే విషయంలో ముందుకెళ్లే అవకాశం ఉంది. **– ఆచార్య పి. మల్లికార్జునరావు, టీడీఆర్ హబ్ డీన్**

బడిలో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి..!

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ రంగు పులుపుముకుంది. తమ అభ్యర్థిగా పాకలపాటి రఘువర్మను ప్రకటించిన కూటమి నేతలను ఓటమి భయం వెంటాడుతోంది. దీంతో తమ అధికారాన్ని ఉపయోగించి, ప్రలోభాలకు తెరలేపారు. సాధారణ ఎన్నికల మాదిరి విందులు, బహుమతులతో టీచర్లను ఆకట్టుకునేందుకు నానా ప్రయాసలు పడుతున్నారు. కూటమి ఎమ్మెల్యేలంతా తమ పరిధిలోని ఉపాధ్యాయ ఓటర్ల వివరాలను తీసుకుని, ఆదివారం ప్రత్యేక విందు సమావేశాలు నిర్వహించడం గమనార్హం.

- కూటమి నేతలకు ఓటమి భయం
- రఘువర్మ గెలుపు కోసం కుయుక్తులు
- పోటీలో ఉన్న అభ్యర్థులకు తాయిలాల ఎర
- 'అపుస్మా'అధ్యక్షుడు సుంకర సైలెంట్
- గాదె మద్దతు సంఘాల నేతలకు వార్నింగ్!
- కూటమి నేతల తీరుపై రగిలిపోతున్న టీచర్లు



విశాఖ విద్య: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు మరో నాలుగు రోజులే ఉన్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అధికారికంగా ఎన్నికల్లో పదిమంది అభ్యర్థులు బరిలోకున్నా.. రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేసిన గాదె శ్రీనివాసులు నాయుడు, పీడీఎఫ్ పక్షాన నిలిచిన కోరెడ్ల విజయ గౌరి, తాజా మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మల మధ్యనే గట్టి పోటీ ఉంటుందని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చసాగుతోంది. రిటైర్డ్ ఆర్‌ఐవో రాయల సత్యనారాయణ సైతం తనకు ఉన్న పరిచయాలతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అయితే, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించటం, ఉపాధ్యాయులను ప్రభావితం చేసేలా ప్రలోభాలకు పాల్పడటంతో ఉపాధ్యాయ వర్గాల్లో మంటలు రేపుతున్నాయి.

'సుంకర'మౌనం వెనుక..

ఎమ్మెల్సీ అభ్యర్థిగా గట్టి పోటీ ఇస్తాడనుకున్న ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్(అపుస్మా) విశాఖ జిల్లా అధ్యక్షుడైన సుంకర శ్రీనివాసరావు వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఓటర్ల నమోదు మొదలుకుని, నామినేషన్ అనంతరం కూడా ఉత్తరాంధ్ర జిల్లాల్లో తమ టీమ్‌తో విస్తృతంగా పర్యటించి, పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో సైలంట్ అయిపోవటం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చకు దారితీసింది. రఘువర్మ కోసం సుంకర శ్రీనివాసరావును పోటీ నుంచి తప్పుకునేలా కూటమి నేతలు ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఉపాధ్యాయులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. రఘువర్మకు మద్దతు ప్రకటించి, సైడైపోవాలని మరికొంత మంది అభ్యర్థులకు సైతం కూటమి నేతలు ప్రలోభాల ఎర వేస్తున్నట్లు తెలుస్తోంది.

నేతల విందు రాజకీయాలు

ఉపాధ్యాయులకు సంబంధించిన ఎన్నికలే అయినప్పటికీ, కూటమి పార్టీల నాయకులు తమ అభ్యర్థిగా రఘువర్మను ప్రకటించటంతో రాజకీయ రంగు పులుముకుంది. ఓడితే, ఎక్కడ తమ పరువు పోతుందోనని భావిస్తోన్న కూటమి నేతలు టీచర్లను ప్రసన్నం చేసుకునేందుకు విందు రాజకీయాలు చేస్తున్నారు. ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలో ఓటున్న టీచర్లకు, స్థానిక నాయకుల ద్వారా ఫోన్లు చేసి మరీ విందుకు ఆహ్వానం పలికారు. గ్రామాల్లోని చోటా మోటా నాయకులు సైతం రంగంలోకి దిగి, తమ పరిచయాలను వాడుకుంటూ టీచర్లకు ప్రలోభాల వల విసురుతున్నారు.

కూటమి తీరుపై టీచర్ల ఆగ్రహం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ నేరుగా కలుగజేసుకోవటంపై ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు. గతంలో ఎన్నడూ ఈ రీతిన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగలేదని బాహాటంగానే ఆక్షేపిస్తున్నారు. గాదె శ్రీనివాసులునాయుడు తరపున ప్రచారం చేసే సంఘాల నాయకులకు సైతం వార్నింగ్‌లు వస్తుండటంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. కూటమి నేతల కుయుక్తులకు లోనవకుండా తమ సమస్యలపై రాజకీయాలకు అతీతంగా శాసనమండలిలో గళం విప్పే వారిని ఎన్నుకునేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాల వారీగా ఓటర్లు

శ్రీకాకుళం	4,829
విజయనగరం	4,937
పార్వతీపురం మన్యం	2,262
అల్లూరి సీతారామరాజు	1,448
అనకాపల్లి	2,802
విశాఖపట్నం	5,277


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతుడు ఆనంద్ (ఫైల్)

గోపాలపట్నం : మనస్తాపంతో యువకుడు మృతి చెందిన ఘటన గోపాలపట్నం ఇందిరానగర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన సోమేష్, నాగరాజు స్నేహితులు. సోమేష్‌కు సొంత ఆటో ఉంది. అప్పుడప్పుడు నాగరాజు ఆప్టింగ్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. గత ఏడాది సంక్రాంతి సమయంలో సోమేష్‌కు చెందిన పర్సు ఆటోలో పడిపోయింది. సోమేష్‌ను ఇంటి వద్ద దించి వేరే బేరం ఉండడంతో నాగరాజు ఆటో తీసుకుని వెళ్లాడు. పర్సు పోయిన విషయాన్ని నాగరాజుకు చెప్పగా.. తనకు తెలియదని బదులిచ్చాడు. సోమేష్ కూడా పోలీసులు ఫిర్యాదు చేయలేదు. ఇదిలావుండగా వీరిద్దరి స్నేహితుడు రౌతు ఆనంద్‌కు మూడు రోజుల క్రితం సోమేష్ పర్సు దొరికింది. అందులో గుర్తింపు కార్డులుండడంతో నాగరాజు ద్వారా సోమేష్‌కు అందజేశాడు. అయితే పర్సులో రూ.25వేలు ఉండాలని, ఆ డబ్బులివ్వాలంటూ నాగరాజు, ఆనంద్‌తో గొడవకు దిగాడు. డబ్బులు విషయం మాకు తెలియదని చెప్పినా వినకుండా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ పేరుతో నాగరాజును, ఆనంద్‌ను స్టేషన్‌కు పిలిపించారు. ఇద్దరూ చెరో రూ.10 వేలు చొప్పున ఇచ్చి కేసు రాజీ చేసుకోవాలని పోలీసులు సూచించారని బంధువులు ఆరోపించారు. ఆదివారం ఉదయం స్టేషన్‌కు పిలిచి మధ్యాహ్నం వరకు ఆనంద్‌ను, నాగరాజును ఉంచేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆనంద్ ఆదివారం మధ్యాహ్నం ఇంటికి చేరుకుని ఊరేసుకుని మృతి చెందాడు. చేయని తప్పునకు బాధ్యుడ్ని చేయడంతో తన కుమారుడ్ని ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలానికి గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, ఎస్ఐ అప్పలనాయుడు చేరుకుని బాధితుల నుంచి సమాచారాన్ని సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అప్పారావు తెలిపారు.

ఎల్లో కలర్ వాటర్ మిలన్



నగరంలో పసుపు రంగు పుచ్చకాయలు ఊరిస్తున్నాయి. న్యూ కాలనీ రోడ్డులో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది కొత్తగా పసుపు రంగు పుచ్చకాయలు నగరానికి వచ్చాయి. పైన పసుపు రంగులో కనిపించే ఈ కాయ లోపల ఎరుపు రంగులో ఉంటుంది. చూడగానే తినాలనిపించేలా, చాలా రుచిగా కూడా ఉంటుంది. దీంతో నగరవాసులు వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

–ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ



పర్యాటక కేంద్రాలు వెలవెల

డుంబ్రిగుడ: నిత్యం టూరిస్టులతో సందడిగా ఉండే ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం బోసిపోయింది. శని, ఆదివారాలలో సందర్శకులు రాకపోవడంతో వెలవెలబోయింది. టెన్త్, ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండడంతో పాటు కుంభమేళ కారణంగా పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని స్థానికులు తెలిపారు. అలాగే లంబసింగికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా తగ్గింది. గతంలో సెలవు రోజుల్లో అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చేవారు.

గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ పరిరక్షణ



ర్యాలీలో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ అధికారులు, సిబ్బంది

ఏయూక్యాంపస్: ఇంధన వనరులను పరిరక్షించుకుంటూ ప్రతి వ్యక్తి దేశాభ్యున్నతికి పాటు పడాలని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) విశాఖ రిఫైనరి ఈడీ రామనాథన్ రామకృష్ణన్ అన్నారు. హెచ్‌పీసీఎల్ విశాఖ లూబ్ రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సైకిల్ థాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే విధంగా సాక్ష్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏయూ ఇన్ గేట్ వద్ద నున్న పెట్రోలియం నుంచి బీచ్ రోడ్డు మీదుగా సైకిల్ థాన్ నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ అధికారులు, సిబ్బంది, డీలర్లు, డెలివరీ సిబ్బంది, నగరవాసులు ఉత్సాహంగా తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. పరిశుభ్రమైన ఇంధనాన్ని, ప్రధానంగా గ్రీన్‌ఎనర్జీని వినియోగిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను తెలిపే విధంగా ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా పెట్రోలియం ఉత్పత్తులను సంరక్షిస్తామని, బాధ్యతాయుత పౌరులుగా నడుచుకుంటూ, దేశ అభ్యున్నతిలో భాగమవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చీఫ్ రీజినల్ మేనేజర్ (లూబ్స్) ఎం.సుందరరావు, జనరల్ మేనేజర్(రిటైల్) బొల్లు రవికాంత్, డీజీఎం (డైరెక్ట్ సేల్స్) సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు వెళుతూ ప్రమాదం

- ఐదుగురికి గాయాలు

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని దేవీనగర్, కురుబుర హాస్టల్ ప్రాంతానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. వీరిలో నలుగురికి స్వల్ప గాయాలు కాగా లక్ష్మీదేవికి ఎడమ కాలు విరిగిపోయింది. బళ్లారికి చెందిన 35 మంది యాత్రికులు, డ్రైవర్ వీరయ్య, క్లీనర్‌తో కలిసి కుంభమేళాకు బయలుదేరారు. శనివారం విజయవాడలో కనకదుర్గ అమ్మవారి దర్శనం అనంతరం ఆనందపురం వైపు వస్తున్నారు. డ్రైవర్ అతివేగంగా వాహనం నడుపుతూ ముందు వెళుతున్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు, పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా ఐఎంఏ అవార్డుల ప్రదానోత్సవం

- పీసీ సర్కార్ జూనియర్‌కు గోల్డెన్ మెజీషియన్ అవార్డు ప్రదానం
- 10 మంది దేశ, విదేశీ ఇంద్రజాలికులకు ఐఎంఏ-2025 పురస్కారాలు



యువతిని గాల్లో ఎగరేస్తున్న బీఎస్ రెడ్డి



పీసీ సర్కార్ జూనియర్‌కు గోల్డెన్ మెజీషియన్ అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

మద్దిలపాలెం: అంతా కళ్లప్పగించి చూస్తుండగానే శూన్యంలోంచి సుందరీమణిని సృష్టించాడు..! ఇది కలో.. నిజమో తేల్చుకునేలోగానే.. అమ్మాయిని పక్షిలా గాల్లో ఎగరేస్తూ ఇంకో విన్యాసం. ఆ ఆశ్చర్యంలో నుంచి తేరుకునేలోపే.. క్షణాల్లో ఆమె చెట్టుగా మారిపోయింది. ఇవన్నీ విశాఖ నగరానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత మహేంద్రజాలికుడు, ఆస్కార్ ఆఫ్ మ్యాజిక్ అవార్డు గ్రహీత డాక్టర్ బీఎస్ రెడ్డి అధునాతన మహేంద్రజాల విన్యాసాలకు మెచ్చుతునక. తన సారథ్యంలోని ఇండియన్ మ్యాజిక్ అకాడమీ దశమ వార్షికోత్సవం, పద్మశ్రీ పీసీ సర్కార్ జయంతికి గుర్తుగా జరిగే అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవం రెంటినీ మేళవించి కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఇండియన్ మ్యాజిక్ అకాడమీ(ఐఎంఏ) అవార్డ్స్ నైట్-2025 అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీర్తిప్రతిష్టలు పొందిన దేశ, విదేశీ సీనియర్ మహేంద్రజాలికులు ఒకే వేదికపై తమ ప్రదర్శనలతో కనువిందు చేశారు. ఉత్సవానికే తలమానికంగా బీఎస్ రెడ్డి 15 నిమిషాలపాటు ప్రదర్శించిన మూడు సరికొత్త మ్యాజిక్ అంశాలు ఆడిటోరియం ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తాయి. అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవానికి మూలకారకుడైన పద్మశ్రీ పీసీ సర్కార్ తనయుడు జూనియర్ పీసీ సర్కార్, మేనకా సర్కార్ దంపతులు విచ్చేశారు. ఈ ఏడాది జీవన సాఫల్య పురస్కారం, గోల్డెన్ మెజీషియన్ అవార్డుల్ని జూనియర్ పీసీ సర్కార్‌తోపాటు, కువైట్‌కు చెందిన మెజీషియన్ డాక్టర్ గుగాంపూ, మమదా(థాయ్‌లాండ్), భారతీయ మ్యాజిక్ నిపుణులు సామ్రాజ్, భూపేష్ దావే, యోనా, జేవీఎల్ఎన్ చారి, కేఎస్ రమేష్, సామల వేణు, కురోలి గణేష్ ఉన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెంచూరియన్ వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఆధునిక తరంలో కళల కాణాచిగా వినుతికెక్కిన విశాఖ పుడమిపై ఐఎంఏ నిర్వహించిన కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని కితాబిచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, రెటైర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి పాల్గన్నారు.

సీపీ చొరవతో 15 ఏళ్ల తరువాత తల్లి చెంతకు..



గురువయ్యను తల్లికి అప్పగిస్తున్న రెడ్ క్రాస్ హోం సభ్యుడు, పోలీసు

బీచ్‌రోడ్డు: మనోవేదనతో 15 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వచ్చేసిన కుమారుడ్ని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో..రెడ్‌క్రాస్ సిబ్బంది ఆధ్వర్యంలో తల్లి చెంతకు చేర్చారు. వివరాలు ఇలా..మచిలీపట్నం జిల్లా పామర్రుకు చెందిన కోటమ్మ దంపతులకు ఆరుగురు సంతానం. వీరిలో గురువయ్యకు పెళ్లి కాగానే కొద్ది రోజుల తరువాత అనారోగ్యంతో భార్య మృతి చెందింది. దీంతో మనోవేదనకు గురై 15 ఏళ్ల క్రితం విశాఖ వచ్చేశాడు. అప్పటి నుంచి విశాఖ బీచ్‌లో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం గురువయ్యను గమనించిన నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి స్థానికంగా ఉండే కానిస్టేబుల్‌కు గురవయ్య సాయంతో పెదవాల్తేరులో ఉన్న రెడ్‌క్రాస్ హోం షెల్టర్‌కు తరలించారు. అక్కడ సిబ్బంది గురవయ్య వివరాలు సేకరించారు. ఆయన తల్లి కోటమ్మ దువ్వాడలోని కుమార్తె వద్ద ఉన్నట్లు గుర్తించారు. దీంతో తల్లికి సమాచారం అందజేయగా..ఆమె ఆదివారం సాయంత్రం రెడ్ క్రాస్ హోంకు చెరుకొని కుమారుడ్ని తీసుకుని వెళ్లింది.

శివరాత్రికి ఏర్పాట్లు

మహా శివరాత్రి పర్వదినాన్ని జరుపుకోవడానికి విశాఖ వాసులు సిద్ధమవుతున్నారు. ఆర్కే బీచ్ వద్ద నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే శివలింగాల ఏర్పాటు, హోమశాలలు ఇతర మండపాల ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి.

–ఫొటోలు : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం



